

డాక్టర్ బిఆర్.అంబేద్కర్

కోనసీమ

27న ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - అమలాపురం

తుపాను హెచ్చరికల నేపథ్యంలో 27వ తేదీ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. అర్జీదారులు తమ సమస్యలను.టోల్ ఫ్రీ నంబర్ 1100 లేదా మీకోసమే వెబ్‌సైట్ ద్వారా అర్జీలు సమర్పించవచ్చునన్నారు. అర్జీదారులు తమ ఫిర్యాదులు లేదా అభ్యర్థనలు సమర్పించేందుకు జిల్లా కేంద్రానికి స్వయంగా రావాల్సిన అవసరం లేదన్నారు. దీనికి బదులుగా టోల్‌ఫ్రీ నంబర్ 1100కు కాల్ చేయవచ్చన్నారు తెలిపారు. సమస్యలు నమోదు చేసిన తర్వాత సంబంధిత శాఖా ధికారులు వాటిని క్షేత్రస్థాయిలో విచారించి తగిన పరిష్కార చర్యలు తీసు కుంటారన్నారు. వాతావరణ శాఖ తుపాను హెచ్చరికలకు అనుగుణంగా తీర ప్రాంతంలో మరియు శిథిలావస్థకు చేరిన పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని డిఇఒను కలెక్టర్ ఆదేశించారు.

తీరం పదిలమేనా..

- మేలు కోకుంటే ముప్పు
- తుపానుల సమయంలో గుబులే
- పలుచోట్ల నిరుపయోగంగా తుపాను షెల్టర్లు

ప్రజాశక్తి-మామిడికుదురు

తుపానుల సమయములో తీర ప్రాంతాలు ప్రమాదకరంగా ఉంటు న్నాయి. తుపాన్లు వరదలు వంటి ప్రకృతి విపత్తులు సంభవిస్తే మన తీర ప్రాంతము ఎంత భద్రమో తెలుసుకుంటే ఆందోళనకు గురి కావాల్సిందే. చిన్న పాటి తుపానులు వచ్చిన తట్టుకోలేని పరిస్థితి నెలకొంది. స్వార్ధ ప్రయోజనాల కోసం రక్షణగా ఉండే ఇసుకను అక్రమముగా తరలించుకుపోతున్నారు. సరుగుడు తోటలు నరికి వేత, మడ అడవుల ధ్వంసం, ఆక్వా అక్రమ సాగుతో సముద్రపు కోత శృతి మించుతోంది జిల్లాలో తరచూ సంభవిస్తున్న తుపాన్లతో తీర ప్రాంతాలలో భారీ నష్టం వాటిల్లుతున్నా ముందస్తు చర్యలులో యం త్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది. ఇప్పటికే వాతావరణ శాఖ బలమైన తుపాన్లు వచ్చే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. దీంతో తీర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతంలో తుపానుల సమ యంలో చోటుచేసుకున్న సంఘటనలు వీరిని వెంటాడుతున్నాయి తుపాన్లు విరుచుకుపడితే ఏ మేరకు ఎదుర్కోగలమన్న ప్రశ్నకు జవాబు దొరకని పరిస్థితి.

దూసుకు వస్తున్న మొంథా తుపాను

మొంథా తుపాను హెచ్చరికలతో ప్రస్తుతం ఈనెల 26, 27, 28, 29 తేదీలు కీలకమైనవి. మొంతా తుపాను ఈ ఏడాది అన్ని తుపానుల కంటే బలమైన తుపాను. మొంథా తుపాను హెచ్చరికలతో జిల్లాలో వశిష్ట వైనతేయ, గౌతమి, వృద్ధ గౌతమి నదీపాయలు సముద్రమలో కలిసే ప్రాంతాలలో రక్షణ చర్యలు అంతంత మాత్రమే కావడంతో జిల్లా ప్రజలు కలవర పడుతున్నారు

కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాలలో తీరం పరిస్థితి ఇది

అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది నుంచి కాకినాడ జిల్లా తొండంగి మండలం అద్దరిపేట వరకు హమారు 162 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతం ఉంది రెండు జిల్లాలలో 12 తీర మండలాలకు సంబంధించి 71 తీర ప్రాంత గ్రామాలు ఉన్నాయి ఈ గ్రామాలలో సుమారు 8 లక్షల మంది సముద్ర తీరానికి అత్యంత సమీపంలో జీవిస్తున్నారు వీరిలో సుమారు 35 వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. తీర ప్రాంతాలలో అధిక శాతం మందికి పక్కా గహాలు లేకపోవడంతో తుఫాన్లు సమయంలో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తుపాను షెల్టర్ల దుస్థితి

సఖినేటిపల్లిలో 15 కిలోమీటర్ల తీర ప్రాంతాలు..సఖినేటిపల్లి, కేశవదాసుపాలెం, అంతర్వేది, అంతర్వేది పల్లిపాలెంలో 8 సెంటర్లు ఉండగా వాటిలో సగం మాత్రమే సేవలందిస్తున్నాయి మలికిపురం మండలంలో 18 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది చింతల మోరి, శంకరగుప్తం, పడమటి పాలెం, కేశనపల్లి, తూర్పు పాలెం, గొల్లపాలెం, గ్రామాలు సముద్రానికి సమీపంలో ఉన్నాయి అన్ని గ్రామాల లోనూ ఆరు తుపాను భవనాలున్నప్పటికీ శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా ఉన్నాయి మామిడికుదురులో కేవలం నాలుగు కిలోమీటర్ల సముద్ర తీరం ఉన్న కరవాక ముత్యాల పాలెం గ్రామాలు ఉన్నాయి. కరవాకలో రెండు తుపాను షెల్టర్లకుగాను ఒకటి శిథిలావస్థలో ఉంది. ముత్యాల పాలెంలోని తుపాను షెల్టర్ శిథిలస్థితిలో ఉండి నిరుపయోగంగా ఉంది. అల్లవరంలో కొమరగిరి పట్టణం, ఓడలరేవు, ఎస్ పల్లి పాలెం గ్రామాలలో ఆరో తుపాను షెల్టర్లు ఉన్నాయి. ఉప్పలగుప్తంలో 16 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఎన్.కొత్తపల్లి, ఎస్.యానం, చల్లపల్లి శివారు వాసాల తిప్ప గ్రామాలు సముద్రానికి చేరువలో ఉన్నాయి. ఆయా గ్రామాలలో 11 భవనాలు ఉండగా వీటిలో సగం శిథిలావస్థ లో ఉన్నాయి కాట్రేనికోనలో 27 కి.మీ తీర ప్రాంతంలో మాగసానితిప్ప మొదలు గచ్చకాయలపొర వరకు 27 కిలోమీటర్ల తీర ప్రాంతంలో 11 గ్రామాలు ఉండగా నాలుగు చోట్ల మాత్రమే షెల్టర్లు ఉన్నాయి. మిగిలిన గ్రామాలలో ఐదు గ్రామాలలో ఒక్క భవనం కూడా లేదు. గతంలో ఉన్న భవనాలు శిథిలం కావడంతో తొలగించారు. ఐ.పోలవరంలో 20 కిలోమీటర్ల తీర ప్రాంతం లో ఐదు గ్రామాలు ఉండగా ఐదు సెల్టర్ లు ఉన్నాయి అవి ఎంత మాత్రం సరిపోవడం లేదు

విపత్తుల సమయంలో ఆదుకునేవి తుపాను షెల్టర్లే

విపత్తుల సమయములో తీర ప్రాంత ప్రజలను ఆదుకునేవి తుపాను భవనాలే. వాటిలోకి ఏ క్షణాన వెళ్లినా పునరావాస, మౌలిక సదుపాయాలు కల్పించేలా సిద్ధంచేసిఉంచాలి. కొద్దిపాటి వార్షిక మరమ్మతులున్నా వాటిని వినియోగములోకి తీసుకురావాలి. సముద్రానికి అతి చేరువగా ఉండే భవనాలు లేని గ్రామాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి తుపాను భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలి. సముద్ర తీరంలో నిర్మించాల్సి రావడంతో గుత్తేదారులు స్థానికంగా లభ్యమయ్యే ఉప్పు నీటిని, ఉప్పునీటిలో లభిస్తున్న ఇసుకను నిర్మాణాలకు ఉపయోగించడంతో అనతి కాలములోనే శిథిలస్థితికి చేరుకుంటున్నాయిజ గ్రామ జనాభాకు అనుగుణంగా షెల్టర్లు నిర్మించాలి వీటి బాగోగులను ఎన్‌జిఒ సంస్థలకు అప్పగించడం ద్వారా భవనాలకు రక్షణ ఉంటుంది. ప్రకృతి విపత్తులు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు బలమైన తాళ్లు, గునపాలు, పారలు,వంట సామగ్రి, ప్రాథమిక చికిత్స విద్యుత్ సదుపాయం అందుబాటులో ఉంచాలి

కొరవడిన మౌలిక వసతులు

తీర ప్రాంత గ్రామాలలో ప్రజలకు నేటికీ మౌలిక వసతులు కరువయ్యాయి తాగునీరు, రహదారులు, విద్యుత్తు వంటి సదుపాయాలు పూర్తిస్థాయిలో సమకూరకపోవడంతో సముద్ర తీర ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా సముద్ర తీర ప్రాంతం కావడంతో ఉప్పునీటి ప్రభావం ఎక్కువగా ఉండి త్రాగునీటి కోసం నరకయాతన అనుభవిస్తున్నారు శివారు ప్రాంతాలు అవడం వల్ల తాగునీటి ప్రాజెక్టుల నుంచి నీరు ఆ ప్రాంతాలకు కుళాయిలకు చేరే సరికి సన్నటిదారలా వచ్చి బిందెడు నీళ్ల దొరకడం కూడా గగనంగా మారుతుంది.



జిల్లాలో సముద్ర కోతకు గురవుతున్న ప్రాంతం(ఫైల్‌ఫోటో), నిరుపయోగంగా ఉన్న కడలి తుపాను షెల్టర్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- తుపానును ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ మహేష్ కుమార్ సమీక్ష

ప్రజాశక్తి - అమలాపురం

తుపానుపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. అమలాపురం కలెక్టరేట్ నుంచి మండల స్థాయి వరకు ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తుపాను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత వాతా వరణ శాఖ హెచ్చరికల మేరకు ఈనెల 27, 28, 29 తేదీలలో జిల్లాలో తుపాను ప్రభావం ఉంటుందని, అదేవిధంగా స్థానికంగా తీరాన్ని దాటే అవకాశాలు కూడా ఉన్నాయని తెలిపారు. భారత వాతావరణ శాఖ సూచనల మేరకు సముద్ర తీరం వెంబడి ఉన్న ప్రజా నీకం అప్రమత్తంగా కావాలని అన్నారు. జిల్లా వాసులు అత్యవసరం అయితే తప్ప మిగిలిన అన్ని ప్రయా ణాలను రద్దు చేసుకోవాలని అన్నారు. అనవసరంగా తుపాను హెచ్చరి కలు మూలంగా ఎవరు సంచరిం చరాదని, ఈ మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురవడంతో పాటుగా ఈదురుగాలులు వేగంగా వీచే అవకాశం ఉందని తెలిపారు. కార్తీకమాసం సందర్భం గా యాత్రికులు నది స్నానాలు, దైవదర్శనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా కేంద్రం అమలాపురంలో 24 గంటలూ అన్ని శాఖల అధికా రులతో కంట్రోల్ రూమ్ నెంబర్ 08856- 293104 ఏర్పాటు చేశామని అన్నారు. తుపాను ప్రభావ ంతో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంప్రది ంచి తగు పరిష్కార మార్గాలు పొందాలన్నారు. అదేవిధంగా తుఫాన్ హెచ్చరికలపై విస్తత ప్రచారం గ్రామాలలో టామ్ టామ్ రెండు రోజులు పాటు నిర్వహించి తీర ప్రాంత ఆవాసాలలోని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆర్‌డిఒలు, తహశీల్దార్లు సముద్ర తీరం వెంబడి ఉన్న తుపాను పునరావాస కేంద్రాలను సిద్ధం ఆదేశించారు. సముద్ర తీర ప్రాంతం వెంబడి ఉన్న ఆవాసాలను ఇప్పటికే మ్యాపింగ్ చేయడం జరిగిందని ఆ ప్రకారం స్థానికంగా ఉన్న తుఫాన్ పునరావస్ కేంద్రాలకు మ్యాపింగ్ చేయాలన్నారు. తీర ప్రాంత పూరి గుడి సెలలో నివసి స్తున్న వారి వివరాలను కూడా సేకరించాలన్నారు. వీఆర్వో పంచాయతీ కార్య దర్శులను పునరావస్ కేంద్రాల నిర్వహణకు ఇన్‌ఛార్జిలుగా నియమించా లన్నారు. పారిశుధ్య ఏర్పాట్లు పంచాయతీరాజ్ శాఖ చేపట్టాలన్నారు. 90 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం వెంబడి మూడు కిలోమీటర్లకు ఒకరు చొప్పున ఇన్‌ఛార్జులను నియమి స్తూ తుపాన్ హెచ్చరికలకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. తీర ప్రాంత సమస్యలను ఇన్చార్జులు మెరైన్ పోలీసులకు తెలపాలన్నారు. ఈనెల 27 నాటికి నిత్యవసరాలన్నీ తీర ప్రాంత గ్రామాలకు ఐదు రోజుల పాటు అవసరాలు మేరకు అందించాలని అన్నారు. మత్స్యకారులు ఎవరు సముద్రంపై వేటకు వెళ్లరాదన్నారు. సముద్రంపై వేటలో ఉన్న వారిని వెంటనే తిరిగి రప్పించాలన్నారు. లోతట్టు ప్రాంతాల లో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు. అదేవిధంగా హెచ్చరికలకు అను గుణంగా పాఠ శాలలకు తాత్కాలిక సెలవులను ఇవ్వాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

రవికుమార్ దీక్షకు పలువురి సంఘీభావం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌ను పునరుద్ధరించి, బస్సులను నడపాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవి కుమార్ చేపట్టిన రిలే దీక్షకు శనివారం ఒక మహిళతో పాటు వృద్ధులు శనివారం సంఘీభావం తెలపారు. రవి కుమార్ చేస్తున్న రిలే దీక్ష శనివారం 15 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న పోతుల భారతి మాట్లాడుతూ సామాజిక కార్యకర్త రవి కుమార్ ప్రజా ప్రయోజనార్థం దీక్ష చేస్తుంటే అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్టాండ్‌కు బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రవికుమార్‌కు సంఘీభావంగా దీక్షలో సీనియర్ జర్నలిస్టు రాంబాల సత్యనారాయణ, పోతుల హేమ సుందరరావు, గుత్తాల వరప్రసాద్, నక్కా ఆనందరావు, జనసేన పార్టీకి చెందిన గుర్రాల రాంబాబు, వై.బాలరాజు పాల్గొన్నారు.



డీలర్లతో మాట్లాడుతన్న తహశీల్దార్ ప్రకాష్‌బాబు

వికలాంగులు, వృద్ధులకు రేషన్ ఇంటికే అందజేయాలి

ప్రజాశక్తి - ఆలమూరు

అరవైఏళ్ళు పైబడిన వృద్ధులు, వికలాంగులు, అస్వస్థతతో బాధపడుతున్న వారికి పారదర్శకంగా రేషన్ సరుకులు వారి ఇంటి వద్దకే వెళ్లి తప్పనిసరిగా అందజేయాలని తహశీల్దార్ కే.జె.ప్రకాష్ బాబు రేషన్ డీలర్లకు ఆదేశించారు. ఆయన ఆధ్వర్యంలో మండల కేంద్రం తహశీల్దార్ కార్యాలయంలో శనివారం రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే వృద్ధులు, వికలాంగులు, అస్వస్థతతో బాధపడుతున్న వారికి రేషన్ షాపు డీలర్లు ఇంటి వద్దకే వెళ్లి నిత్యావసర సరుకులు అందిస్తున్నారని అన్నారు. రేషన్ షాపుల వద్దకు వారు ఎవరు రావలసిన అవసరం లేదని ఆయన తెలి పారు. అలాగే ప్రభుత్వ నిబంధనలకు లోబడి ప్రతి రేషన్ డీలర్లు పనిచేస్తున్నారని అన్నారు. రేషన్ షాపులు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తహశీల్దార్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్‌సర్వే మంగారావు, ఆర్ఐ.రామాయమ్మ, బి. గుమస్తా సుబ్రహ్మణ్యం, రేషన్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపుపై విజ్ఞప్తి

- ఉపాధ్యాయులపై పని ఒత్తిడి తగ్గించాలి
- ఎంఎల్‌సి బి.గోపిమూర్తి

ప్రజాశక్తి - అమలాపురం

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రివ్యూ పిటిషన్ వేయించాలని ఎంఎల్‌సి బి.గోపిమూర్తి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమలాపురం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశం నందు ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి మాట్లాడారు. ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గించాలని, యాప్‌లను రద్దు చేయాలని, మూల్యాంకన విధానం సరళీకృతం చేయాలని, బోధనేతర పనులన్నీ రద్దు చేయాలని, ఇటీవల జరిగిన బదిలీలలో రిలీవర్ లేక బదిలీ కాలేకపోయిన ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్మెంట్ లేదా మరే విధంగానైనా సరే ఆ ఖాళీలు భర్తీ చేసి, వెంటనే రిలీవ్ చేయాలని అన్నారు. అలాగే ప్లస్ టూ హైస్కూళ్లలో తగినంత మంది ఫేకల్టీ లేక బోధన కుంటుపడుతోందని అన్నారు. వెంటనే అర్హత గల స్కూల్‌అసిస్టెంట్లను పిజిటిలుగా ప్రమోషన్ ఇవ్వడం ద్వారా భర్తీ చేయాలని అన్నారు. అన్ని మేనేజ్ మెంట్లలో ఖాళీగా ఉన్న లాంగ్వేజ్ అసిస్టెంట్ పోస్టులను అర్హత గల లాంగ్వేజ్ పండిట్‌లకు ప్రమోషన్ ఇవ్వడం ద్వారా భర్తీచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్ టివి.సుబ్బారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరారావు, బియన్.శివ కుమార్, బియన్.వెంకటేశ్వరరావు, కె.సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపి మూర్తి

ప్రజా ఉద్యమంతో కూటమికి కనువిప్పు

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రజా ఉద్యమంతో కూటమి ప్రభుత్వానికి కనువిప్పు కలిగిద్దామని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, రాజోలు నియోజకవర్గ పరిశీలకులు కర్రి పాపారాయుడు అన్నారు. గోగన్నమఠంలో శనివారం ప్రజా ఉద్యమం పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు ఈ నెల 28న నియోజకవర్గ కేంద్రాలలో మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ప్రజాఉద్యమం నిర్వహిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వానికి తమ వ్యతిరేకం వ్యక్తం చేస్తూ పాల్గొనేలా వారిని చైతన్యవంతులను చేయాలన్నారు సమావేశంలో బొలిశెట్టి భగవాన్, భూపతి రాజు సత్తిబాబు రాజు, కటకంశెట్టి ఆదిత్య, సూరిశెట్టి బాబి, వైస్ ఎంపిపి భూపతిరాజు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరిస్తున్న గొల్లపల్లి సూర్యారావు



ఎర్రపోతవరంలో చేలు పరిశీలిస్తున్న అధికారులు

నేలకొరిగిన పంట చేల పరిశీలన

ప్రజాశక్తి - రామచంద్రపురం

భారీ వర్షాలకు కె.గంగవరం మండలంలోని ఎర్ర పోతవరం, శివల, తాళ్లపాడు తదితర ప్రాంతాల్లో నేలకొరిగిన పంట పొలాలను మండల వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరువాక కో-ఆర్డినేటర్ ఎన్.నందకిషోర్, సైంటిస్టులు డాక్టర్ రమేష్ బాబు, సహదేవ రెడ్డి, ఆనంద్‌కుమార్, జిల్లా వనరుల శాఖ ఎఒ మనోహర్, కె.గంగవరం ఎఒ సద్గురు మూర్తి రైతులతో మాట్లాడారు. మొంథా తుపాను ముప్పు పొంచి ఉన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని రైతుల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అదేవిధంగా పడిపోయిన పంట చేలు దుబ్బులుగా పైకి లేపి నిలుపుకోవాలని, వరి చేలలో చేరిన వర్షం నీటిని ఎప్పటికప్పుడు మురుక్కు కాలవల్లోకి తొలగించాలని, లేదా బయటకు తోడుకోవాలని తద్వారా తొలకరి వరి పంటను రక్షించుకోవచ్చని వారు సూచించారు. ఎర్ర పోతవరంలోని గ్రామ సర్పంచ్ పిల్లి రాంబాబు, సొసైటీ ఛైర్‌న్ సాపిరెడ్డి దొరబాబు,మాకినిడి సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది వ్యవసాయ అధికారులు వెంట వెళ్లి పంట పొలాలను పరిశీలించారు.

రెండుచోట్ల ఉపాధి హామీ గ్రామ సభలు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం మండలంలో మాచర, వల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభల్లో 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో గుర్తించిన ఉపాధి హామీ పనుల వివరాలను గ్రామ సభలో ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లు శివకష్ణ చదివి వినిపించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని జెఇ రవికుమార్ వివరించారు. మాచర లో 82 పనులు, వల్లూరులో 75 పనులు గుర్తించినట్లు తెలిపారు. ఈ పనుల వివరాల నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ దాసి మీనాకుమారి, వల్లూరి వీరబాబు, ఉప సర్పంచ్ అడపా వేణు, గుడాల జయబాబు, సత్తి బాబు, కార్యదర్శులు సత్తిబాబు, జి చినబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు శివ కృష్ణ, మేట్లు, ఉపాధి కూలీలు, రైతులు, పాల్గొన్నారు.



మాచర గ్రామ సభలో మాట్లాడుతున్న జెఇ రవికుమార్

ఎఒఐ వార్షికోత్సవాన్ని జయప్రదం చేయాలి


ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎఒఐ) మొదటి వార్షికోత్సవ సంబరాలు జయప్రదం చేయాలని శనివారం అమలాపురం ఎల్ఐసి కార్యాలయంలో రాజమండ్రి డివిజన్ ఎఒఐ యూనియన్ అధ్యక్షుడు సానబోయిన వీరభద్ర రావు అధ్యక్షతన జరిగిన కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా కొన్ని కీలక నిర్ణయాలు చర్చించారు. అతి తక్కువ కాలంలో అమలాపురంలో యూనియన్ స్థాపించి డివిజన్ ప్రెసిడెంట్ ఏకగ్రీవంగా ఎన్నికైన వీరభద్రరావుని యూనియన్ కమిటీ అభినందించింది. అలాగే నవంబర్ నెలలో జరిగే మొదటి వార్షికోత్సవ సంబరాలు అందరూ కలిసికట్టుగా చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో తీర్మానించారు. అమలాపురం అధ్యక్షుడు డివిజన్‌కి వెళ్లడంతో అమలాపురం బ్రాంచ్ అధ్యక్షత పదవికి ఎ.నాగేంద్ర కుమార్‌ని ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్టుగా కమిటీ తీర్మానం చేసింది. ఈ ప్రక్రియను వచ్చే నెలలో జరిగే మొదటి వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం సభలో తీర్మానం చేసి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. అనేక రకాల పోరాటాలు చేసి సాధించిన విజయాల గురించి అలాగే ఈమధ్య రద్దయిన జిఎస్‌టి గురించి యూనియన్ చేసిన పోరాటాల గురించి సమావేశంలో తెలియజేశారు. ముఖ్య అతిథులు బ్రాంచ్ మేనేజర్ కె.సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ మధుబాబు హాజరై ఏజెంట్ డెవలప్మెంట్, కాంపిటీషన్స్ అనేక విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.వినాయకరావు, ట్రెజరర్ దొమ్మేటి శివ స్వామి, కడలి శ్రీనివాసరావు, కేతా వీరస్వామి, యాడ్ల ఆదినారాయణ, ఎండియస్ గౌడ్, అధికార బాబ్జి, మద్దా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఒఐ యూనియన్ నాయకులు

కార్టూ'నిజం'



గడప దాటుతున్న కలప

యథేచ్ఛగా వృక్షాల నరికివేత

ఫారెస్ట్ రేంజి పరిధిలో అక్రమార్కులు

ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ఉపయోగించాలి

మద్యం షాపును పరిశీలించిన మంత్రి సుభాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మద్యం షాపుల్లో మద్యాన్ని కొనుగోలుచేసే వారు ఎక్సైజ్ సురక్ష యాప్‌ను వినియోగించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్రపురంలో బస్టాండ్ సమీపంలోని ఆర్ఆర్ మద్యం షాప్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక మద్యం విధానాన్ని తీసుకువచ్చి, నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టేందుకు, నాణ్యతను తెలుసు కునేందుకు ప్రభుత్వం ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్'ను రూపొందించిందని, మద్యాన్ని కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఈ యాప్ ద్వారా స్కాన్ చేసి, తాము కొనుగోలు చేసేది నకిలీ మద్యమా లేక నాణ్యమైనదా అన్న విషయాన్ని తెలుసుకోవచ్చుని మంత్రి వివరించారు. ఈ యాప్ వినియోగంపై ప్రతి గ్రామంలోనూ ప్రజలకు విధిగా అవగాహన కల్పించాలని ఆయన పిలుపు నిచ్చారు. గత ప్రభుత్వంలో ఎక్కడా డిజిటల్ చెల్లింపులు చేయకుండా, కేవలం నగదు రూపంలో మాత్రమే అమ్మ కాలు చేసి, ఆ సొమ్మంతా తమ జేబుల్లోకి వేసుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సరఫరా చేస్తున్న నాణ్యమైన మద్యం వివరాలన్నీ ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్‌లో ఉంటాయన్నారు. మద్యం ఎక్కడ తయారైంది, ఎప్పుడు తయారైంది, ఏ కంపెనీకి చెందినది, ఎంత ధర వంటి అన్ని వివరాలు తెలుసుకోవచ్చని ఆయన తెలియజేశారు. ప్రభుత్వం నకిలీ మద్యం తయారీ ఎక్కడా జరగకుండా, అలాంటి మద్యం అమ్మకాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుందని, అందులో భాగంగానే క్యూఆర్ కోడ్‌తో కూడిన యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని, ప్లేస్టోర్‌లో కూడా యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని తెలుసుకోవచ్చునని మంత్రి తెలిపారు. మంత్రి సుభాష్ వెంట ఎక్సైజ్ సిఐ, పి.శ్రీనివాస్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .




సురక్ష యాప్ గురించి వివరిస్తున్న మంత్రి సుభాష్, ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాస్

రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా పౌర సరఫరాల అధికారి ఎఉదయ భాస్కర్ తెలిపారు. రసాయన కిట్లతో రేషన్ బియ్యం గుర్తించవచ్చునని ఆయన వెల్లడించారు. పేదలకు ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ బియ్యం మాఫియా చేతుల్లో దుర్వినియోగమవుతున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం నిశ్చయించిందన్నారు. అధికారుల అంచనాల ప్రకారం 60 శాతం మంది కార్డుదారులు బియ్యాన్ని దళారులకు అమ్మేస్తున్నారన్నారు. ఇంకా 20 శాతం మంది వలస కూలీలు, తాము పనిచేసే ప్రాంతాల్లోనే బియ్యాన్ని అమ్ము తున్నారన్నారు. ఇలా 80 శాతం బియ్యం మాఫియాల చేతుల్లోకి వెళ్లి పోతుండటమే సమస్యకు మూల కారణమన్నారు. రసాయన కిట్లతో జిల్లాలోని 8 మంది పౌర సరఫరాల శాఖ ఉప తహశీల్దార్లు, ఇద్దరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఈ కొత్త రసాయన కిట్లు అందించినట్లు తెలిపారు. మరో కిట్ జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలోఎఎస్ఒ శరత్, అసిస్టెంట్ మేనేజర్ సృజన, పౌర సరఫరాలు ఉప తహశీల్దార్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఇఒ

పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జిల్లాలోని పిఎం శ్రీ పాఠశాలల్లో చేపట్టిన సివిల్ వర్క్స్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా, సమగ్ర శిక్ష ఎపిసి జి.మమ్మీ సంబంధిత అధికారులను ఆదేశించారు. డిఇఒ కార్యాలయంలో శనివారం సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 26 పిఎం శ్రీ పాఠశాలల్లో పూర్తి కావాల్సిన పనుల వివరాలను తెలుసుకున్నారు. సమావేశంలో ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ విభాగం నుంచి జి.ప్రవీణ్‌కుమార్, సమగ్ర శిక్షా ఇఇ సుబ్బరాజు, డిఇఇ నాగేశ్వరరావు, సెక్టోరల్ అధికారులు బివివి.సుబ్రహ్మణ్యం, డి.రమేష్ బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎంఎకె.భీమారావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కాలువలో వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ హైస్కూల్ పక్కన ఉన్న ఎలక్ట్రికల్ షాప్ సమీపంలోని కాలువలో ఒక వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..అమీనాబాద్ గ్రామానికి చెందిన దయలపల్లి ఆంధ్రయ్య (55) శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఎలక్ట్రికల్ షాప్ పక్కన ఉన్న కాలువ వద్ద పడుకొని ఉండగా శనివారం ఉదయం ఉప్పాడ పంచాయితీ స్లీపర్లు ఆంధ్రయ్యను ఎంత లేపిన స్పందించకపోవడంతో స్లీపర్లు వెళ్లిపోయారని తెలిపారు. కాసేపటి వ్యవధిలో ఆంధ్రయ్య కాలవలో పడి ఉన్నట్లు గుర్తించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడి పందేలపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట, గోకవరం, పెరవలి

జగ్గంపేట మండలంలోని సీతారాంపురంలో కోడి పందేలపై శనివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5,200 నగదు, రెండు కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్ఐ వెల్లడించారు.

గోకవరం మండలం మల్లవరంలో కోడిపందేలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.17 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు. కొత్తపల్లిలో బొమ్మా బొరుసు ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.3200 నగదు స్వాధీనం చేసుకున్నారు.

పెరవలి మండలం కాపవరంలో పేకాడుతున్న ఆరుగురిని డ్రోన్ సాయంతో గుర్తించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5120 నగదు, కొత్తపల్లి అగ్రహారంలో పేకాడుతున్న ఐదుగురు వద్ద నుంచి రూ.2200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు

వ్యాన్‌ను ఢీ కొట్టిన లారీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ఎడిబి రోడ్డులోని పతంజలి పామ్ టెక్ పరిశ్రమ ఎదురుగా కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న ఐసర్ వ్యాన్‌ను వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో స్థానిక ఎస్ఐ వి.మౌనిక సంఘటనా స్థలానికి చేరుకొని హైడ్రా క్రెయిన్ సహాయంతో కేబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి చికిత్స నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కోడిగుడ్ల వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. కోడిగుడ్లు పాడయ్యాయి. రెండు వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదం పై కేసు నమోదు చేసి పోలీసులు ధర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో విద్యుత్ షాకు గురై కార్మికు డు మతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్కియాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఆలయంలో గడ్డిని కోస్తుండగా బియ్యంపేటకు చెందిన దొంగ భీమన్న(46) విద్యుత్ ప్రమా దానికి గురై మృతి చెందాడు. మృతుని కుమారుడు దూడలు వీరబాబు ఈ విషయమై ద్రాక్షారామం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ర్యాంపులో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - కొవ్వూరు

వాడపల్లి ఇసుక ర్యాంపులో రీజినల్ విజిలెన్స్ టాస్క్ ఫోర్స్ ఎడిటి కిషోర్ శనివారం రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా నుంచి ఇసుక తెలంగాణ ప్రాంతానికి తరలిపోతోందని ఇచ్చిన నివేదిక మేరకు ఇసుక ర్యాంపుల్లో రవాణా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రీజనల్ పరిధిలో రెండు బృందాలు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రోజు విడిచి రోజు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అధిక లోడుతో వెళుతున్న వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు. వాడపల్లి ర్యాంపులో ఇసుక తరలింపుకు సంబంధించిన రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా బోర్డర్ పరిధిలో ఉన్న మండలాలకు ఇసుక సరఫరా చేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించిన మీదటే అనుమతించాలని సిబ్బందికి సూచించారు.

వాడపల్లికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం కార్తీక మాసం మొదటి వారం కావడంతో యాత్రికులు పోటెత్తారు. సుమారు 80 వేల పైబడి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్‌రావు ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు.

జాతీయ పోటీలకు శ్రీగౌతమి విద్యార్థిని

ప్రజాశక్తి -గోపాలపురం

పంజాబ్‌లో జాతీయ స్థాయి సెపక్‌తాక్రా పోటీలకు శ్రీగౌతమి కళాశాల విద్యార్థిని మంచిలి లాస్య ఎంపికైనట్టు సెక్రటరీ, కరస్పాండెంట్ కెఎస్‌డి.ఆశీర్వాదం తెలిపారు. ఇంటర్ ప్రథమ విద్యార్థిని మంచిలి లాస్య అక్టోబర్ 11, 12వ తేదీల్లో బాపట్ల జిల్లా చీరాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో కాంస్య పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ పోటీలు నవంబర్‌లో పంజాబ్ రాష్ట్రంలో నిర్వహిస్తారని తెలిపారు. ఆ విద్యార్థిని ఆర్థిక స్తోమతను దృష్టిలో పెట్టుకొని కళాశాల తరపున విద్యార్థినికి రూ.7,000 సాయం అందించినట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపల్స్ వై.ప్రసాద్, కె.సంపత్ కుమార్, పీడీ సాయి కుమార్ పాల్గొన్నారు.

మన్నే కుటుంబానికి తోట పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

తిరుమలాయపాలెంలో ఇటీవల మరణించిన మన్నే మంగయమ్మ కుటుంబ సభ్యులను వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం శనివారం పరామర్శించారు. తోట శ్రీరామ్‌జీ, గుల్ల ఏడుకొండలు, పాటి రాంబాబు, మన్నె బుజ్జి, ఉప సర్పంచ్ దాకవరపు దుర్గాప్రసాద్, గునుపే ఏడుకొండలు, మంగాల ఆనందం పాల్గొన్నారు.

భద్రత కల్పించలేమా..?

భేటీ పడావో... భేటీ బచావో పేరుతో కేంద్రం, బాలికల రక్షణకు చర్యలు అంటూ రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారాలు అంతా ఇంతా కావు... ఇందులో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రజాప్రతినిధులతో పాటూ అధికారులు ఇందులో భాగస్వామ్యం అవుతున్నారు. ఈ కార్యక్రమాల్లో బాలికల రక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామంటూ నేతలు చేస్తున్న ప్రసంగాలు ప్రతి రోజూ ఏదొకమూల వింటూనే ఉన్నాము. మీడియాలో ఈ మేరకు వస్తున్న వార్తలు కూడా కోకొల్లలు. కాని పాలకులు, అధికారులు చెబుతున్న మాటలు, చేస్తున్న ప్రకటనలు మాత్రం కార్యాచరణలో కానరావట్లేదు. ఫలితంగా బాలికలకు భద్రత కల్పించలేమా? అనే ప్రశ్నకు కల్పించలేము అనే సమాధానమే వస్తుంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జరిగిన వరుస ఘటనలే దీనికి నిదర్శనంగా నిలిచాయి. హాస్టల్ నుంచి ఒక విద్యార్థిని, గురుకులం నుంచి మరో విద్యార్థిని బయటకు తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటనలు తీవ్ర సంచలనం రేపాయి. ఈ రెండు ఘటనలు పరిశీలిస్తే పాలకుల వైఫల్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రెండు ఘటనల్లోనూ సిబ్బంది వైఫల్యం కనిపిస్తున్నా... దీని వెనుక ప్రభుత్వ నిర్లక్ష్యం దాగి ఉంది.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని బిసి సంక్షేమ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని ఒక యువకుడు బైకుపై తీసుకెళ్లాడు. వారితో పాటూ మరో యువకుడు కూడా వెళ్లారు. బాలికను ఒక లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. బాలిక తల్లి కాల్ చేసిన సమయంలో గాయాలను చూసి ఆరా తీసేవరకూ హాస్టల్ సిబ్బంది సైతం గుర్తించలేని పరిస్థితి ఉంది. ఎట్టకేలకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసినట్టు ఈ నెల 23న ప్రకటించారు. తుని ఘటన సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉంది. 62 ఏళ్ల వృద్ధుడు అభం శుభం తెలియని బాలికపై అత్యాచారానికి ఒడిగట్టాడు. దర్యాప్తులో మూడు సార్లు అత్యాచారం చేసినట్టు పోలీసులు చెబుతున్నారు. మనవరాలి వయస్సున్న బాలికపై అత్యాచారానికి దిగిన నిందితుడిని పట్టుకున్న స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అనంతరం పరిణామాల్లో నిందితుడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు చెబుతున్నారు. ఈ మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ రెండు ఘటనలూ హాస్టల్స్‌లో చదువుతున్న బాలికలు, వారిని చదివిస్తున్న తల్లిదండ్రుల్లో భయాందోళనలను సృష్టించాయి. ఇదే సమయంలో హాస్టల్స్‌లో బాలికల రక్షణ ఎంతనే చర్చ కూడా వచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టళ్ళు, గురు కులాలు, కస్తూరిబా పాఠశాలలను నేటికీ సిబ్బంది కొరత వేధిస్తుంది. మెజారిటీ వసతిగృహాల్లో రక్షణ చర్యలు శూన్యం. కనీసం వాచ్‌మెన్ లేని పరిస్థితులూ ఉన్నాయి. భవనాలకు సైతం రక్షణ లేని పరిస్థితి. కొన్ని హాస్టళ్లకు ప్రహరీలు కూడా లేవు. మరికొన్ని హాస్టళ్లలో వార్డెన్లు లేరు. ఈ నేపథ్యంలో బాలికల రక్షణ ఎలా సాధ్యమవుతుంది అనేది ప్రశ్న. ప్రభుత్వాలు బాలికా విద్యకు ప్రాధాన్యత ఇస్తామని చెబుతున్నా.. బడ్జెట్‌లో మాత్రం దీనికి సంబంధించిన కేటాయింపులు అరకొర మాత్రమే. ఏదైనా ఘటన జరిగినప్పుడు సంబంధిత హాస్టల్ వార్డెన్లు, లేదా ఇతర సిబ్బందిని సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకోవడం పరిపాటిగా మారింది. కాని మూలాలను గుర్తించి వాటికి పరిష్కారం చూపడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు ఎక్కువగా ఉన్నాయి. జరిగిన ఘటనలను పరిగణలోకి తీసుకుని ఇప్పటికైనా బాలికల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరుకుంటున్నారు విద్యార్థులు తల్లిదండ్రులు.

గోదారి గలగలలు

డబ్బే పరమావధిగా పనిచేస్తున్న ప్రయివేటు ట్రావెల్స్ యాజమన్యాలు. ప్రయాణికులు భద్రతను గాలికొదిలేసి ఇష్టాను సారంగా వ్యవహరిస్తున్నాయి. వారి ప్రాణాలను పణంగా పెట్టి వ్యాపారాలు సాగిస్తున్నాయి. రెండు రోజుల క్రితం కర్నూలులో జరిగిన దుర్ఘటన ఈ విమర్శలకు మరో సాక్ష్యంగా నిలిచింది. ఈ ఘటన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోనూ విషాదాన్ని నింపింది. డాక్టర బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన శ్రీనివాసరెడ్డి ఈ ఘటనలో సజీవ దహనమయ్యాడు. భార్య, ఇద్దరు పిల్లలతో పాటూ వృద్ధులైన తండ్రి, మావయ్య అందరూ శ్రీనివాసరెడ్డిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కుటుంబ పోషణ నిమిత్తం శ్రీనివాసరెడ్డి క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా బెంగళూరు వెళ్తూ ఈ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో వారి కుటుంబం వీధిన పడింది. చిన్నారులైన ఇద్దరి పిల్లలతో శ్రీనివాసరెడ్డి భార్య రోధిస్తున్న తీరు అందర్నీ కంట తడిపెట్టించింది. ప్రయివేటు ట్రావెల్స్‌పై అధికారులు ఆజమాయిషీ లేకపోవడం, ముడుపులు ఇతర కారణాలతో చూసీచూడకుండా వదిలేయడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయనేది బహిరంగ రహస్యం. ఇప్పటికైనా అధికారులు, పాలకులు గుణపాఠం నేర్చుకుని ప్రయాణికులకు భద్రత కల్పించాలని కోరుకుందాం.



విచారణాధికారులతో మాట్లాడుతున్న బయట వ్యక్తులు

పి.గన్నవరం సిహెచ్‌సిలో వైద్యాధికారుల విభేదాలపై విచారణ

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం కమ్యూనిటీహెల్త్ సెంటర్(సిహెచ్‌సి)లో వృత్తిపరమైన నిబంధనలో ఇద్దరు వైద్యాధికారుల మధ్య తలెత్తిన వివాదంపై విజయనగరం డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎన్.పద్మావతి, వైజాగ్ సిఎస్ఎస్ డాక్టర్ ఎం.లక్ష్మీ ప్రసన్నలతో కలిసి శుక్రవారం విచారణ నిర్వహించారు. వైద్య సిబ్బందిని ఒక్కొక్కరిని పిలిచి విచారణ నిర్వహిస్తున్న సమయంలో కొంత మంది బయట వ్యక్తులు సూపరింటెండెంట్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. దీనితో విచారణ చేయాలా వద్దా అనే విచారణ అధికారులు అసహనం వ్యక్తం చేశారు. విచారణ సమయంలో బయట వ్యక్తులు జోక్యం చేసుకోవడం ఎంతవరకు సబబు అని విమర్శలు వినిపిస్తున్నాయి. విచారణకు ఆటంకం కలగడంతో విచారణ వాయిదా వేసినట్లు తెలుస్తోంది. విచారణ నిర్వహించి నివేదికను విచారణాధికారులు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఎంఎల్ఎ జోక్యంతో మహిళా వైద్యాధికారిపై కమిషనరేట్‌కు ఫిర్యాదు చేయడంతో నెలరోజుల క్రితం విచారణ జరిగింది. విచారణ ఏకపక్షంగా కాకుండా రాజకీయ జోక్యం లేకుండా సమగ్రంగా విచారణ జరుగుతుందా అన్నది చర్చనియాంశంగా మారింది.

హ్యుమానిటీ క్లబ్ ఛైర్మన్‌గా విద్యానిధి నాయుడు

ప్రజాశక్తి - రామచంద్రపురం



విద్యానిధి నాయుడుతో జివి.రావు

మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు యూనివర్సల్ సింగిల్ ఫ్యామిలీ భావనతో ప్రారంభించనున్న హ్యుమానిటీ క్లబ్ 21వ ఛైర్మన్‌గా విద్యానిధి విద్యాసంస్థల అధినేత ఎబి. నాయుడుని నియమించారు. ఈ మేరకు శనివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. మోడరన్ హ్యుమానిటీ క్లబ్‌కి సంబందించిన ప్రతిపాదనను తెలియజేశారు. హ్యుమానిటీ క్లబ్ యూనిట్స్ ఛైర్మన్‌గా ఆయనను జివి.రావు సాదరంగా ఆహ్వానించారు. దీనికి నాయుడు సానుకూలంగా స్పందించి తాను రెండు యూనిట్ల భాద్యత తీసుకోవటానికి సంసిద్ధత వ్యక్తం చేసినట్లు జివి.రావు తెలియజేశారు. నాయుడు ఆధ్వర్యంలో 60 మంది సభ్యులు కూడా సభ్యత్వం తీసుకొనడానికి సుముఖత చూపారని రావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దశలవారీగా మరింత విస్తతం చేస్తూ ప్రణాళికబద్ధంగా ముందుకు అడుగులు వేస్తున్నట్లు ఆయన వివరించారు. 'ఆకలి లేని సమాజం' అనే ఆశయ సాధనతో తాను తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని అందరూ స్వాగతించి మద్దతుగా నిలుస్తారని జివి.రావు ఈ సందర్భంగా తెలియజేశారు.

'వాయిస్ యాక్టివేటెడ్'తో మహిళలకు రక్షణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మహిళలు ఆపద సమయంలో వాయిస్ యాక్టివేటెడ్ పెండెంట్‌తో వారకి రక్షణ కలుగుతుందని భీమవరం బిఫార్మసి విద్యార్థులు పేర్కొన్నారు. వివరాలు ఇవి..మండలంలోని లొల్ల గ్రామానికి చెందిన హనుమంతు మౌనిక ఆదిత్య భీమవరంలో బిఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతోంది. తోటి విద్యార్థులు శ్రీవల్లిక, వైనిగ్న, శారదతో కలసి వాయిస్ యాక్టివేటెడ్ పెండెంట్ ప్రాజెక్టును తయారు చేశా రు. వాయిస్ యాక్టివేటెడ్ పెండెంట్ ప్రాజెక్టు జిపిఎస్ ట్రాకర్, అనుసంధానమే ఉంటుంది. దీని వల్ల మహిళలకు ఏదైనా ఆపద సంభవిస్తే ఎమర్జెన్సీలో ఎవరు సహాయం లేకుండా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కు, షిటీంకు, లేదా దగ్గర్లో ఉన్న బంధువులకు ఆటో మెటిగ్గా ఫోన్ కాల్స్ వెళ్తుంది. దీని ద్వారా మహిళలు ఆపదలో ఉన్నప్పుడు వాయిస్ యాక్టివేటెడ్ పెండెంట్ వారికి రక్షణగా నిలుస్తుందని ఆదిత్య పేర్కొంది. విద్యార్థులతో ఈ ప్రాజెక్టును చేయడం తనకు గర్వంగా ఉందని తోటి విద్యార్థులు కూడా ఈ ప్రాజెక్టును తయారు చేయడానికి శ్రమించారని ఆమె తెలిపింది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ మహిళలకు రక్షణ కరువైందని వాయిస్ యాక్టి వేటెడ్ పెండెంట్ బాలికలకు, మహిళలకు రక్షణగా నిలు స్తుందని ఈ సందర్భంగా పలువురు అన్నారు. ఈ ప్రాజెక్టు ప్రథమ స్థానం నిలిచిందని విద్యార్థులను ప్రిన్సిపల్ నటరాజన్ అభినందించారు.

టాటా ఎలక్ట్రానిక్స్‌కు 42 మంది ఎంపిక

ప్రజాశ క్తి - అమలాపురం

వికాస ఉద్యోగమేళాలో ఎంపికైన 42 మంది అభ్యర్థులను టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీకి బస్సు ఏర్పాటు చేసి పంపించామని వికాస ప్రాజెక్టర్ కె.లచ్చారావు శనివారం తెలిపారు. వీరంతా అభ్యర్థులు కోనసీమ జిల్లా నుంచి హోసూర్ తమిళనాడులో గల టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీకి జాయినింగ్ నిమిత్తం వెళ్తు న్నారని ఆయన తెలిపారు. వీరికి 19400 సిటిసి లభిస్తుందని మరియు ఉచిత భోజనం వసతి కూడా ఏర్పాటు చేస్తారని ఆయన తెలిపారు. అందరూ కష్టపడి పని చేసి తమ ఉద్యోగానికి న్యాయం చేసి మరింత ఉన్నత స్థానాలు అందుకోవాలని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో వికాసా జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్, వికాస ప్రతినిధులు ఎం. రవితేజ, రాజా రమేష్ లు పాల్గొన్నారు.


27 నుంచి అమలాపురం - రాజమండ్రి నాన్‌స్టాప్ సర్వీసులు

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం నుంచి రాజమండ్రికి వెళ్ళే ప్రయాణికుల అధిక రద్దీని దృష్టిలో ఉంచుకుని అమలాపురం - రాజమండ్రి నాన్‌స్టాప్ అల్ట్రా డీలక్స్ సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్.టి.పి. రాఘవకుమార్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు.ఈ సర్వీసులు అక్టోబర్ 27 నుంచి ప్రారంభం కానున్నాయని బస్సు అమలాపురం ఈదరపల్లి వయా ముక్కామల మీదుగా ప్రయాణిస్తుందని ఆయన వెల్లడించారు.

అన్నప్రసాదానికి రూ.1లక్షా 15 వేల వితరణ

ప్రజాశక్తి-మామిడికుదురు



దాతకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

పాశర్లపూడి బాడవకు చెందిన కటిగిరెడ్డి రామకృష్ణ, ఆదిలక్ష్మి దంపతుల కుమారులు గంగాధరరావు, మాధవిశైలు దంపతులు, వారి కుటుంబ సభ్యులు శనివారం అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి వారిని దర్శించుకున్నారు. 2,400 మంది యాత్రి కులకు అన్నప్రసాద వితరణ జరిపించు నిమిత్తం రూ.1,15,200 విరాళముగా సమ ర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు . వీరికి ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేసి శ్రీ స్వామివారి చిత్రపటమును అందజేసినారన్నారు

తుపాను ప్రభావంతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - రామచంద్రపురం

భారత వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ఈనెల 27, 28, 29 తేదీలలో కోనసీమ జిల్లాలో తుపాను ప్రభావం ఉంటుందని, స్థానికంగా తీరాన్ని దాటే అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచనల మేరకు రామచంద్రపురంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆర్‌డిఒ దేవరకొండ అఖిల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం డివిజన్‌లో భారీ వర్షాలు, తుపానుల కారణంగా డివిజన్ పరిధిలోని అన్నీ మండలముల లోని 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. 23 నుంచి 30. వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని ఆమె వివరించారు. తుపాను ప్రభావంతో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంప్రదించాలని కంట్రోల్ రూమ్ ఫోను నెంబరు 08857 - 245166 ఆర్‌డిఒ తెలిపారు.

అభివృద్ధిలో మహిళల పాత్రపై అవగాహన

ప్రజాశక్తి - రావులపాలెం

పరిపాలన అభివృద్ధిలో మహిళల పాత్ర అనే అంశంపై గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులకు హైదరాబాద్ బోస్కో సేవా కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. శనివారం స్థానిక పారా సంస్థ వద్ద జరిగిన అవగాహన కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ సోడా బత్తిన అంబేద్కర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పరిపాలన అభివృద్ధిలో మహిళా పాత్ర, ఎదుర్కొన్న సమస్యలను నెట్‌వర్క్ రూపంలో సాధించిన విజయాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అంబేద్కర్ మాట్లాడుతూ పరిపాలన అభివద్ధిలో మహిళలు కూడా పురుషులతో పరిపాలనలో సమానంగా గ్రామాన్ని అభివద్ధి పరచాలన్నారు. కార్యక్రమంలో టి.రమేష్, పారా కో-ఆర్డినేటర్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. వీ లీడ్ మూడు మండల ఇన్‌ఛార్జిలు పోతుమూడి శేషారత్నం, వెజ్ డైరెక్టర్ పి.శాంత కుమారి తదితరుల సహకారంతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆత్రేయపురం గ్రామ సర్పంచ్ గెడ్డం సుధా, ర్యాలి గ్రామ సర్పంచ్ కె.లక్ష్మి, కొత్తపేట గ్రామ సర్పంచ్ బూసి విజయలక్ష్మి, లక్ష్మీ పోలవరం గ్రామ సర్పంచ్ హేమలత, ఎంపిటిసి సభ్యులు, వార్డు సభ్యులు వివిధ గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

వైసిపి కోటి సంతకాల సేకరణకు రచ్చబండ

ప్రజాశక్తి - ఆలమూరు

వైసిపి జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి సూచన మేరకు మండలంలో మూలస్థానంలో వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన కోటి సంతకాల సేకరణకు రచ్చబండ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వైసిపి ఇచ్‌ఛార్జి తోరాటి రాంబాబు, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ యనమదల నాగేశ్వరరావు, నియోజవర్గ బూత్ కన్వీనర్ నామాల శ్రీనివాస్, సర్పంచ్ గుణ్ణం రాంబాబు, మాజీ సర్పంచ్ ద్వారంపూడి దొరబాబు, మాజీ సొసైటీ ఛైర్మన్ నల్లి రాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు తోట కొండయ్య, తోరాటి గోవిందు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి మంత్రి దుర్గేష్ పరామర్శ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చెముడులంకలో మృతుని కుటుంబాన్ని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం నేతలతో కలిసి పరామర్శించారు. చెముడులంకకు చెందిన సిద్ధిరెడ్డి గణేష్ కడియపులంకలో పూల వ్యాపారం చేసుకుంటూ తన కుటుం బాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల గుండెపోటుకు గురై మరణించాడు. శనివారం మంత్రి దుర్గేష్ పార్టీ శ్రేణులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ప్రభుత్వం నుంచి రావలసిన అన్నింటిని త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటానని బాధితులకు హామీ ఇచ్చారు. దుర్గేష్ మాట్లాడుతూ జనసేనకు అత్యంత విధేయతతో ఉంటూ తన అమూల్యమైన సేవలు అందిస్తూ చురుకుగా గణేష్ వ్యవహరించేవాడన్నారు. అలాంటి వ్యక్తిని పార్టీ కోల్పోవడం తీరని లోటన్నారు. కార్యక్రమంలో నేతలు గట్టి నరసయ్య, పుల్ల చిట్టిబాబు, అడబాల వీర్రాజు, అడబాల శ్రీనివాస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో చేరికపై కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - కొత్తపేట

విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ లో చేరడానికి మూడ , ఆఖరి దశ కౌన్సెలింగ్ షెడ్యూల్ ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెపి.రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండవ దశలలో సీట్లు పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బిఎ, బికాం, బిఎస్‌సి, మరియు బిజెడ్‌సిలలో వివిధ సింగిల్ మేజర్ ప్రోగ్రామ్స్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ ఈ నెల 25, 26 తేదీలలో చేసుకోవాలని, వెబ్ ఆప్షన్లను ఈ నెల 28, 29 తేదీలలో నమోదు చేసుకోవాలని, సీట్ల కేటాయింపు నవంబరు 1 న ఉంటుందని, సీట్లు పొందినవిద్యార్థులు నబంబరు 4 లోపు కళాశాలలో రిపోర్టు చేయవలసి ఉంటుందని తెలిపారు. కొత్తపేట, పరిసర ప్రాంత్రాలలోని విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నవంబర్ 8న బౌద్ధ వారసత్వ ఉత్సవం

ప్రజాశక్తి-రాజానగరం

నవంబర్ 8న నిర్వహించే కోరుకొండ కాపవరం బౌద్ధ వారసత్వ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (తారకం) రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనాల లాజర్ పిలుపు ఇచ్చారు. సూర్యారావుపేటలో బౌద్ధ ఉత్సవ కమిటీ సభ్యులు మేకల లక్ష్మీపతి ఆధ్వర్యాన శనివారం ఉత్సవ కరపత్రం ఆవిష్కరించారు. బిఎస్‌పి రాజానగరం నియోజకవర్గ అధ్యక్షుడు కొల్లాటి అబ్బులు, మాలల ఐక్యవేదిక కన్వీనర్ ముప్పిడి, ఐక్యవేదిక కార్యదర్శి ప్రత్తి నాగేశ్వరరావు, ఐక్యవేదిక సభ్యులు మేకల చిన వీర్రాజు, కొల్లాటి చినవెంకన్న, బేదంపూడి సూర్యారావు, గొంతి శివ, జాలెం కుమార్, బొర్రా కాశి, నాగారపు అనందరాబు, పేకల సారంగ, తలారి సూరిబాబు పాల్గొన్నారు.

27న కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 27న సోమవారం ఛైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ పి.రవి వర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న సోమవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలు నందు ఛైర్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తారని అన్నారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు వివిధ శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కమిషనర్ కోరారు.